తాగునీరు వృథా...

శుభశ్రీ కళ్యాణ మండపం వద్ద రెండు నెలలుగా వృథాగా పోతున్న మంచినీరు

నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు

విశాలాంధ్ర - ఆనందపురం: తాగునీరు ప్రతి బొట్టును ఒడిసి పట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉంది. రోజు రోజుకి జలవనురుల ప్రాముఖ్యత తగ్గుతున్నప్పటికీ స్వచ్ఛమైన తాగునీరుని వృధా చేస్తున్నారు. అనందపురం మండలం బంటుపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న శుభశ్రీ కళ్యాణ మండపం వద్ద తాగునీటి పైపు లీకు కావడంతో తాగునీరంతా రోడ్డుపైనే కాలువ వలే ప్రవహిస్తుంది. ఈ నీరు కాలువలే ప్రవహించడం వల్ల గ్రామాలకు వెళ్లే రహదారి పూర్తిగా గోతులమయంగా మారి వాహనదారులు ట్రాఫిక్‌తోపాటు తరచు ప్రమాదాలకు గురవుతున్నారు. తరచూ వాహన రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పైపు చెడిపోవడంతో రోడ్డుపైనే నీరు దర్శనమిస్తుంది. నెలలు గడుస్తున్న మరమ్మతులు చేయకపోవడం అధికారుల పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంచినీరు వృధాగా పోవడం చాలా బాధాకరమని ఉందని స్థానికులు వాహనదారులు వాపోతున్నారు. నీరు అక్కడ చేరిపోవడం వల్ల నిరంతరం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని, నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని, మరల ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా చూడవలసిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని వెంటనే పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి తాగునీరు సమస్య పరిష్కారం చేసి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి హల్‌చల్

రాయితో కారు అద్దాలు పగలగొట్టిన వ్యక్తి

విశాలాంధ్ర - పీఎం పాలెం: మధురవాడ ఉడా రోడ్, సబ్ రిజిస్టర్ ఆఫీస్ దగ్గరలో మతిస్థిమితం లేని వ్యక్తి మంగళవారం మధ్యాహ్నం హల్ చల్ చేశాడు. రోడ్డుమీద పరిగెడుతూ చేతికి అందిన రాయితో విలువైన వస్తువులు, కార్ల అద్దాలు పగల గొట్టుకుంటూ పోయాడు. స్థానికులు అతన్ని పట్టుకొని చెట్టుకు కట్టేశారు. ఫిర్యాదు అందుకున్న పీ.ఎం.పాలెం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ సంఘటనలో 3 కార్ల అద్దాలు ధ్వంసం అయ్యాయి. అనేకమంది ఈ రహదారిలో భయ భ్రాంతులకు గురయ్యారు. రోడ్లపై నడిచేవారు భయాందోళన చెందారు. అనేక షాపుల పైకి కూడా ఆ వ్యక్తి రాళ్లు రువ్వడంతో అందరూ భయాందోళన చెందారు.

పోలీసుల ఆధ్వర్యంలో రికవరీ మేళా

విశాలాంధ్ర - విశాఖ క్రైమ్: విశాఖలోని గడిచిన నెలలో 105 దొంగతనం కేసులు నమోదు చేయగా 75 కేసులను ఛేదించి 103 మందిని అరెస్టు చేశామని సీపీ శంఖబత్ర భాగ్చీ తెలిపారు. 105 కేసుల్లో 103 మంది అరెస్ట్ చేయగా రూ. 1,20,24,000 సొత్తు రికవరీ చేశామన్నారు. 18 బైకులు, 423 మొబైల్ ఫోన్స్ బాధితులకు అందజేస్తున్నట్లు వెల్లడించారు. అత్యధికంగా స్టీల్ ప్లాంట్లో 31 రికవరీ చేశారన్నారు. జూలై నెలకన్నా ఆగస్టు నెలలో అధికంగా సొత్తు రికవరీ చేసిన క్రైమ్ సిబ్బంది కృషిని సీపీ అభినందించారు.

రెండు నెలల్లో టిడ్కో నిర్మాణాలు పూర్తి

టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: రెండు నెలల్లో టిడ్కో గృహాలకు పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని టిడ్కో సూపరింటెండెంట్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం వెంకటేశ్వరరావు టిడ్కో, టాటా ప్రాజెక్ట్ అధికారులతో కలిసి పెద గంట్యాడ టిడ్కో గృహాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడ్కో గృహాల పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా పనులు పూర్తి చేస్తామని, రెండు నెలల్లో పనులు పూర్తి చేసి లబ్ధి దారులకు అందజేస్తామని అన్నారు. టిడ్కో గృహాలలో మౌళిక సౌకర్యాలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడ్కో ఈఈ సుధాకర్, డి.ఈ రాజేష్, టాటా ప్రాజెక్ట్ మేనేజర్ హర్షవర్ధన్, ఈఈ రాజబాబు, ఏ.ఈ గోపాల్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, జిల్లా సమితి సభ్యులు జి.ఆనంద్, టిడ్కో లబ్ధిదారులు పి.అప్పల రాజు, ఖాన్, రమణి పాల్గొన్నారు.

గ్రంథాలయాల విస్తరణ అభినందనీయం

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు

విశాలాంధ్ర - విశాఖ సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమంది పైడిరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతమున్న గ్రంథాలయాలకు మౌలిక వసతులు కల్పించి ఆధునీకరిం చడానికి చర్యలు చేపడతామనడం సంతోషదాయకమన్నారు. అసెంబ్లీ సమావేశాలలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేష్ ప్రకటన చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సమాజ చైతన్యానికి, మేధాశక్తి విస్తరణకు నిలయాలైన గ్రంథాలయాలు మారుతున్న సామాజిక మాధ్యమాల విపరీత ధోరణి కారణంగా గ్రంథాలయాల ప్రభావాన్ని కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ నిర్వాకంతో విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి వారికి అకడమిక్‌పరంగా లాభం కంటే నష్టమే ఎక్కువైందని వాటి ద్వారా విద్యార్థులు ఆన్‌లైన్ గేమ్స్, సినిమాలు చూడటానికి ఎక్కువ సమయం కేటాయించే వారని విమర్శించారు. లక్ష్యంతో ప్రస్తుత ప్రభుత్వం పాఠశాల స్థాయిలోనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడానికి మౌలిక వసతులు కల్పించడమే కాకుండా ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఒక మంచి గ్రంథాలయాన్ని ఏర్పాటు దిశగా అడుగులు వేయడం విద్యార్థులకు శుభ పరిణామం అన్నారు. రాజధాని అమరావతిలో 150 కోట్లు, విశాఖలో 20 కోట్లు వెచ్చించి గ్రంథాలయాలను ఏర్పాటుకు చర్యలు చేపట్టడం ప్రభుత్వ నిబద్ధతకు, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ ఎంతో అభినందనీయమని ప్రశంసించారు.

ఘనంగా బెహర జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - సింహాచలం: గ్రేటర్ విశాఖ జనసేన పార్టీ నాయకులు బెహరా భాస్కరరావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బెహరా హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ బెహరా విజయ రవితేజ కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అడవివరం ది కోపరేటివ్ బ్యాంకు క్రెడిట్ సొసైటీ డైరెక్టర్లు, జనసేన పార్టీ నాయకులు గునిశెట్టి శ్రీనివాసరావు, గేదెల మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం బెహరా భాస్కరరావు విదేశాల్లో ఉన్నారని, ఆయన లేకపోయినా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించడం ఆనందదాయకమన్నారు. బెహరా అభిమానులు బెహరా సత్యనారాయణ, గొడ్డు నాగరాజు, బలిరెడ్డి శ్రీను, ఇ.వి.రమణ, షేక్ వల్లి ఆధ్వర్యంలో బెహరా హాస్పిటల్‌లో రోగులకు, శ్రీనివాస్ నగర్ శ్రీ బంగారు తల్లి వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ధవళ గోపాల్, బురెడ్డి గోపి, పొట్నూరి శంకర్రావు, బల్లంకి వెంకట్రావు, గొంతిన నాగరాజు, దేరెడ్ల సత్యనారాయణ రెడ్డి, ఊటపల్లి గోవిందు, బండి దుర్గేష్, తెలుకుల రమేష్, ధవళ మోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తారు రోడ్డు పనుల పరిశీలన

విశాలాంధ్ర - పెందుర్తి: జీవిఎంసీ 95వ వార్డు పరిధి, పురుషోత్త పురంలోని కంఫర్ట్ హౌస్ అవుట్ గేట్ నుండి హౌసింగ్ బోర్డ్ కాలనీ వరకు 40.90 లక్షలతో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణ పనులను కూటమి నాయకులు మంగళవారం పరిశీలించారు. పెందుర్తి జనసేన సీనియర్ నాయకుడు పెందుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉరిటి లక్ష్మి గోవింద్, పెందుర్తి తెలుగు యువత అధ్యక్షులు కోటిబని శ్రీను యాదవ్, చీర రాజు, కోరడా శ్రీను, దాకారపు ఈశ్వరరావు, జోగ ఏర్నిరాజు, బాదంపూడి కృష్ణ, ఉరిటి శ్రీను, నమ్మి ఆశోక్ తదితర ఉమ్మడి కూటమి నాయకులు ఆ పనుల్ని పరిశీలించి, కాంట్రాక్టర్లతో మాట్లాడి నాణ్యతతో నిర్మాణ పనులు పూర్తి చేయాలని సూచించారు. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా త్వరిత గతిన పనులు పూర్తి చేయాలని అదికారులు, కాంట్రాక్టర్లను కోరారు. ఈ సందర్భంగా లక్కీ గోవింద్ మాట్లాడుతూ ఈ రోడ్డు నిర్మాణం కోసం అడిగిన వెంటనే నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

కాపులప్పాడలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - భీమిలి: భీమిలి మండలం కాపులప్పాడ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భీమిలి వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయ ప్రసాద్, వ్యవసాయ అధికారి బి.శివ కోమలి వరిపొలాలను రైతులతో పాటు సందర్శించారు. ప్రస్తుతం వరి పొలాల్లో ఆకు ముడతతెగులు ఎక్కువగా ఉన్నట్లు గమనించి వరి పంట పిలక దశలో ఉన్నందున ఆకు ముడత తెగులు నివారణకు గాను ఒక ఒక ఎకరానికి అయితే క్లోరోపైరీఫాస్ 400 మిల్లీలీటర్లు మందును 300-400 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని అన్నారు. అలాగే 10 నుంచి 15 ఎకరాలు ఒకే దఫా పురుగు మందులు పిచికారీ చేయాల్సిన అవసరం వచ్చినప్పుడు డ్రోన్ ను ఉపయోగించినట్లయితే సమయాన్ని ఆదా చేసుకోవచ్చని మరియు పురుగుమందులకు అయ్యే ఖర్చును కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి నర్సింగ్ విద్యార్థుల రాష్ట్ర సదస్సు

- ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా రెండు రోజుల కార్యక్రమాలు

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్రవిశ్వ విద్యాలయం కన్వెన్షన్ సెంటర్ వేదికగా ది ట్రైన్డ్ నర్సస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (టి.ఎన్.ఏ.ఐ) ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఆధ్వర్యంలో 24, 25 తేదీల్లో రెండు రోజులపాటు నర్సింగ్ విద్యార్థుల ద్వైవార్షిక రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్- 2025ను నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ మిడ్ వైఫ్ కౌన్సిల్ రిజిస్ట్రార్, టి.ఎన్.ఏ.ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రొఫెసర్ కె.సుశీల తెలిపారు. సోమవారం సాయంత్రం రామ్ నగర్‌లోని ఒక హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాన్ఫరెన్స్ వివరాలను ఆమె వెల్లడించారు. ఆంధ్ర విశ్వ విద్యాలయం కన్వెన్షన్ సెంటర్ వేదికగా రెండు రోజులపాటు లెర్నింగ్ టుడే, లీడింగ్ టుమారో జర్నీ ఆఫ్ నర్సింగ్ స్టూడెంట్స్ అనే అంశంపై సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులలో సామర్థ్యాలను వెలికితీసి, వారిలో నాయకత్వాన్ని ప్రోత్సహించే విధంగా రెండు రోజుల కార్యక్రమాలు ఉంటాయన్నారు. నర్సింగ్ విద్యార్థుల జీవితాలో ఒక మరపురాని సందర్భంగా ఈ కార్య క్రమం నిలిచిపోతుందన్నారు. సదస్సుకు ఎన్‌టిఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ హాజరవుతారన్నారు. టి.ఎన్.ఏ.ఐ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్ శంషీర్ బేగం మాట్లాడుతూ వేలాది మంది నర్సింగ్ విద్యార్థులు రంగోలి, పోస్టర్ ప్రజంటేషన్, సైంటిఫిక్ పేపర్ ప్రజంటేషన్, పెయింటింగ్, మోనో ఏక్టింగ్, వ్యాస రచన, నృత్య పోటీలను నిర్వహిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులు కె.ఝాన్సీ లక్ష్మీభాయి, డి.ఉష వన్నగ వేణి, ఆచార్య బి.అనంతమ్మ, కె.వి.శ్రీదేవి, కె.పద్మావతి, ప్రెస్ అండ్ పబ్లిసిటీ చైర్ పర్సన్ ప్రీతం లూక్స్, కో చైర్ పర్సన్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి విక్రయదారుల మేలు దిశగా ఆపరేషన్ లంగ్స్

యూసీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం.సత్యవేణి

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ ఆపరేషన్ లంగ్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. పాదచార మార్గాలు, రహదారులు, ముఖ్య కూడళ్లలోని తాత్కాలిక ఆక్రమణలను తొలగించి ప్రజల రక్షణ, సౌకర్యాలను కల్పించడం ఒక వైపు జరుగుతుండగా, మరోవైపు వీధి విక్రయదారుల సంక్షేమం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేపడుతోందని, జీవీఎంసీ అర్హులైన వీధి విక్రయదారులను గుర్తించి వారికి వ్యాపార అవకాశాలు, జీవనోపాధి ప్రయోజనాలు కల్పించే చర్యలు తీసుకుంటోందని, ఈ కార్యక్రమంపై ఎటువంటి అపోహలు, వదంతులు, అసత్య ప్రచారం నమ్మవద్దని యూ.సీ.డి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం.సత్యవేణి వీధి విక్రయదారులు, ప్రజలకు మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా కమిషనర్ ఆదేశాల మేరకు జోనల్ కమిషనర్లు ఇప్పటికే జోనల్ కార్యాలయాలలో వీధి విక్రయదారుల కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించారన్నారు. ఆపరేషన్ లంగ్స్ ముఖ్య ఉద్దేశ్యం నగర పరిశుభ్రత, రక్షణతో పాటు ప్రజలు, పాదచారులు, వాహనదారులకు సౌకర్యాలు కల్పించడం, అలాగే వీధి విక్రయదారుల వ్యాపార ప్రయోజనాలను కాపాడుతూ వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునే వెసులుబాటు కల్పిస్తామని ఆమె తెలిపారు. ఈ ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వీధి విక్రయదారుల చట్టం, వీధి విక్రయ విధాన మార్గదర్శకాల్లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి ప్రత్యామ్నాయ సౌకర్యాలు కల్పిస్తామని ప్రాజెక్ట్ డైరెక్టర్ తెలిపారు. ఆపరేషన్ లంగ్స్‌లో భాగంగా ఆక్రమణల తొలగింపు విషయమై ఎటువంటి అపోహలు, వదంతులు, అసత్య ప్రచారం నమ్మవద్దని ప్రజలు, వీధి విక్రయదారులకు ప్రాజెక్ట్ డైరెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కేంద్ర పథకాలపై ఖాతాదారులకు అవగాహన

విశాలాంధ్ర - పద్మనాభం: మండలంలోని పాండ్రంగి, పెంట గ్రామాల్లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఖాతాదారులకు అవగాహన సదస్సులను నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి జనరల్ మేనేజర్ ఆర్‌కె మహాన, ఎల్‌డిఎం శ్రీనివాస్, డిప్యూటీ రీజినల్ హెడ్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పి రాజేష్‌లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే అనంతవరం బ్రాంచ్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ భీమా పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్‌బిఐ ఏజిఎం రాధాకృష్ణ మూర్తి, ఎల్‌డిఎమ్ శ్రీనివాస్, సిఎమ్‌ఎఫ్‌ఐ వేణుగోపాల్, ఎఫ్‌ఐ మేనేజర్ రాఘవేంద్రలు హాజరయ్యారు. ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన, జీవనజ్యోతి భీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, ఈకేవైసీ, నామిని, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, నాయకులు, బ్యాంకు ఖాతాదారులు, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారులపై కూటమి సర్కార్ కక్షసాధింపు

- జీవీఎంసీ వద్ద ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు యత్నం..
- మేయర్, ఎంపీ, కూటమి ఎమ్మెల్యేలు వ్యాపారులకు క్షమాపణలు చెప్పాలి
- బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలి
- వైసీపీ జిల్లా అధ్యక్షులు కేకే రాజు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: వీధి వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న హాకర్ల పట్ల ఈ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని, కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా వారి దుకాణాలను కూల్చివేయడం దారుణమని వైసీపీ విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లో తోపుడు బండ్లు, బడ్డీల కూల్చివేతలను నిరసిస్తూ మంగళవారం జీవీఎంసీ ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అడుగడుగునా ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పోలీసులు అనేక ఆంక్షలు విధించారు. జీవిఎంసీ వద్ద ర్యాలీని అడ్డుకునేందుకు కూడా పోలీసులు విఫలయత్నం చేశారు. ర్యాలీ అనంతరం జీవీఎంసీ అదనపు కమిషనర్ రమణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు తొలగించిన దుకాణాలేవీ అక్రమంగా ఏర్పాటు చేసినవి కావని, ఈ దుకాణాలకు గతంలో ట్రేడ్ లైసెన్స్‌లు ఇచ్చి, విద్యుత్ మీటర్ కనెక్షన్ ఇచ్చి ఇదే అధికారులు హాకర్ జోన్లలో వ్యాపారాలను ప్రోత్సహించారన్నారు. జీవీఎంసీ అధికారుల దాడుల్లో దుకాణాలు కోల్పోయిన వ్యాపారులకు తక్షణం నష్ట పరిహారం చెల్లించాలని, ప్రభుత్వం స్పందించకుంటే మేయర్, ఎంపీ, కూటమి ఎమ్మెల్యేలను బయట తిరగనిచ్చేది లేదని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం కారణంగా నగరంలో దాదాపు 40 వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్ కుమార్, సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, తిప్పల దేవన్ రెడ్డి, మొల్లి అప్పారావు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధి తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఆర్ఐటి అధ్యాపకులకు జాతీయస్థాయి అవార్డులు

విశాలాంధ్ర - ఆనందపురం: నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలకు చెందిన ఇద్దరు అధ్యాపకులకు కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపేటెన్సిస్ ఆధ్వర్యంలో అవార్డులు సాధించారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ ఉత్తమ ఉపాధ్యాయ ప్రొఫెసర్ అండ్ విభాగాధిపతి బి.శివప్రసాద్, అసోసియేటెడ్ ప్రొఫెసర్ అండ్ లీడ్ ఐఐఈ ఉత్తమ మెంటార్ అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి జేఎన్‌టీయూ జీవీ వైస్ ఛాన్సలర్ ప్రో. రాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను సమగ్రంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర చాలా ముఖ్యమని పేర్కొన్నారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో లావణ్య రేఖకు డాక్టరేట్

విశాలాంధ్ర- విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధన విద్యార్థిని పైలా లావణ్య రేఖకు డాక్టరేట్ లభించింది. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి మార్గదర్శకత్వంలో రహదారుల నిర్మాణంలో నేల పై భాగంలో ఉండే మట్టి (సబ్గ్రేడ్ సాయిల్ (స్ట్రెంత్) నాణ్యత, పటిష్టతను గుర్తించడానికి సులభమైన విధానాలను రూపొందించినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను పరిశోధక విద్యార్థిని లావణ్య రేఖ అందుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డీన్ అకాడమిక్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, డిపార్ట్మెంట్ హెడ్ ఆచార్య సి.ఎస్.వి. సత్యనారాయణ రెడ్డి, సివిల్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు, పరిశోధకులు అభినందించారు.

విశాఖ విశ్రాంత పోలీసు అధికారుల సంఘ వార్షిక సమావేశం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఆంధ్రప్రదేశ్ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం వార్షిక సమావేశం స్థానిక రామ కృష్ణ బీచ్ రోడ్, పోలీసు ఆఫీసర్స్ విశ్రాంత భవనంలో జరిగింది. సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాల కొండయ్య, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ సి.ఆర్ నాయుడు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణ, కోశాధికారి డాక్టర్ కె.వి నారాయణ, సంయుక్త కార్యదర్శి సిహెచ్ చక్రపాణి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కె.రామకృష్ణ, విజయవాడ అధ్యక్షుడు ఏఎస్ఎస్ రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో విశాఖపట్నం పోలీసు కమిషనర్ శంకర్ బ్రాత భాగ్చి, విశాఖ డీఐజీ గోపీనాథ్ జెట్టి, విశ్రాంత డిఐజిలు కే.బాలకొండయ్య, వి.వి.గోపాలకృష్ణ పాల్గొన్నారు. విశ్రాంత ఐజి కే.లక్ష్మణ మోహన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మాలకొండయ్య మాట్లాడుతూ సంఘానికి సభ్యులు అండగా ఉండాలన్నారు. ఈ సంఘానికి విశ్రాంత పోలీసు అధికారులందరూ చేదోడు వాదోడుగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. కింది స్థాయి ఉద్యోగుల సమస్యలను కూడా పరిష్కరించాలని ఆయన కోరారు. సంఘ సమావేశాలు ప్రతి యూనిట్ పరిధిలో జరగాలని అధ్యక్షుడు మాలకొండయ్య సూచించారు. గౌరవ అధ్యక్షుడు సి.ఆర్ నాయుడు మాట్లాడుతూ అసోసియేషన్ సమావేశాలకు అందరూ హాజరై యోగక్షేమాలను తెలుసుకుంటూ సహాయం చేయాలని సూచించారు.

ఘనంగా శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: శ్రీ దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలు 76వ వార్డు లో ఘనంగా నిర్వహించారు. శ్రీ గణేష్ దుర్గా యూత్ ఆధ్వర్యంలో గత పదేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఈ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిధులుగా మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక బీజేపీ నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు హాజరై పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాది ఈ ప్రాంతంలో యువకులు, మహిళలు ముందుకు వచ్చి ఆధ్యాత్మిక సేవ చేయడం అభినందనీయం అని అన్నారు. కార్య క్రమంలో కమిటీ సబుల్యులు మహిళలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తోడ్పాటుతో వీధిలైట్లు ఏర్పాటు

విశాలాంధ్ర భీమిలి: స్థానిక ఎస్వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం జరిగింది. కళాశాల ఆవరణలో చీకటి కారణంగా తలెత్తుతున్న ఇబ్బందులు పట్ల ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కి ప్రిన్సిపల్ పి సురేఖ, సిబ్బంది ,విద్యార్థులు విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి వెంటనే కళాశాల ఆవరణలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించడం జరిగింది. కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ , అధ్యాపక బృందం,భోదనేతర సిబ్బంది,విద్యార్థినీ, విద్యార్థులు ఈ చర్య పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా దీనికి సహకరించినటువంటి కళాశాల పూర్వ విద్యార్థి జడ్పిటిసి గాడు వెంకటప్పడుకి, గాడు వెంకటనారాయణ కి,జోనల్ కమిషనర్ కి, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

అలరించిన సాంస్కృతికోత్సవం

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూనివర్సిటీ స్థాయి యువజనోత్సవం రెండవ రోజైన మంగళవారం సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించింది. శాస్త్రీయ నృత్యం లో, జానపద నృత్యంలో, బృంద నాట్యంలో, సోలో సింగింగ్, గ్రూప్ సింగింగ్ మరియు నాటికలు విభాగాలలో జాతీయ సేవా పథక కార్యకర్తలు తమ అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి, అహూతులను అలరించారు. 30 ఆంధ్ర విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల నుండి మరియు క్యాంపస్ కళాశాలల నుండి దాదాపు 650 మంది వివిధ అంశాలలో పోటీపడి, యువజన సత్తాను చాటారు. 150 మందికి పైగా వాలంటీర్లు బృంద నాట్యాలలో పాల్గొని సాంస్కృతిక శోభను విశ్వవిద్యాలయ ప్రాంగణానికి తీసుకువచ్చారు. ముఖ్యంగా థింసా నృత్యం, కోయదొరల విన్యాసం, కోలాటం, జాతర తదితర జానపద నృత్యాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. ఉదయం 9గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు సాగిన సాంస్కృతిక ఉత్సవం విశ్వ విద్యాలయ ప్రాంగణాన్ని శోభాయమానం చేసింది. వివిధ పోటీల్లో పాల్గొన్న వారికి మరియు విజేతలకు

బహుమతులను జాతీయ సేవా పథక దినోత్సవం సందర్భంగా బుధవారం వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్ చేతుల మీదుగా అందించడం జరుగుతుందని జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో- ఆర్డినేటర్ డి.సింహాచలం అన్నారు. కార్యక్రమ నిర్వాహకులుగా జోనల్ ఆఫీసర్ డాక్టర్ పి. ఉమామహేశ్వరరావు, నోడల్ ఆఫీసర్ ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, ఇతర సీనియర్ ప్రోగ్రాం అధికారులు వ్యవహరించారు.

రెగ్యులర్ గ్యారెంటీడ్ ఆదాయ ప్రణాళిక 'ఎడ్జ్'ను ప్రారంభించిన కోటక్ లైఫ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: ఆర్థిక భద్రత ద్వారా జీవితాలను శక్తివంతం చేస్తూ 25వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటున్న కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్, నేటి వినియోగదారుల మారుతున్న ఆర్థిక అవసరాలను తీర్చడానికి రూపొందించిన సమగ్ర జీవిత బీమా పరిష్కారం, కోటక్ ఎడ్జ్ (అర్లీ డిఫైండ్ గ్యారంటీడ్ ఎర్నింగ్స్)ను ప్రారంభిస్తున్నట్లు ప్రకటించింది. నేటి వేగవంతమైన ప్రపంచంలో వినియోగదారులు తక్షణ శ్రద్ధ అవసరమయ్యే ఆర్థిక బాధ్యతలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో, పాలసీదారులకు ముందుగానే రెగ్యులర్ ఆదాయాన్ని అందించే విధంగా రూపుదిద్దుకోవడం ద్వారా, కోటక్ ఎడ్జ్, అదనపు ఆదాయాన్ని సృష్టిస్తూ వినియోగదారుల జీవన అవసరాలకు తోడ్పడటానికి ఒక ప్రత్యేక పరిష్కారం అవుతుంది. తక్షణ ప్రాధాన్యతలను తీర్చడానికి, డిమాండ్‌పై వచ్చే ఆదాయ వనరుగా ఇది వినియోగదారులకు సాధికారతను అందిస్తుంది అని కోటక్ మహీంద్రా లైఫ్ ఇన్సూరెన్స్ డైరెక్టర్ మహేష్ బాలసుబ్రమణియన్ చెప్పారు. తక్షణ లిక్విడిటీతో పాటు దీర్ఘకాలిక హామీ ఆదాయాన్ని సమన్వయం చేస్తూ, కోటక్ ఎడ్జ్ పాలసీదారులకు ఒకే ప్రణాళికలో అనేక ప్రయోజనాలను అందిస్తోంది. రెగ్యులర్ పేఅవుట్‌లు, ప్రారంభ రెగ్యులర్ ఆదాయం, హామీ రాబడి మరియు సమగ్ర జీవిత కవరేజీని సమన్వయం చేస్తూ ప్రత్యేకంగా రూపొందించబడిందన్నారు. వినియోగదారుల జీవితాలతో పాటు ఆర్థిక పరిష్కారాలు కూడా అభివృద్ధి చెందాలి అనే నమ్మకంతోనే కోటక్ మహీంద్రా లైఫ్ యొక్క 25 ఏళ్ల ప్రయాణం ముందుకు సాగుతోందన్నారు. ఆ దిశలోనే కోటక్ ఎడ్జ్ దీర్ఘకాలిక రక్షణ, ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుతూ ముందస్తు ఆదాయ మద్దతును అందించే వినూత్న పరిష్కారం అన్నారు.

25 నుండి రంజీ ట్రోఫీ ప్రాబబుల్స్ క్యాంప్

విశాలాంధ్ర - పీఎం పాలెం: రాబోయే 2025-26 దేశవాళీ సీజన్ కోసం రంజీ ట్రోఫీ ప్రాబబుల్స్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్నట్లు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సభ్యులు తెలిపారు. ఈ శిబిరం 25 సెప్టెంబర్ 2025న విజయనగరంలోని ఏసీఏ అకాడమీలో న్యూజిలాండ్ మాజీ జాతీయ కోచ్, హెడ్ కోచ్ గ్యారీ స్టెడ్ పర్యవేక్షణలో ప్రారంభమవుతుందన్నారు. ఈ క్యాంప్‌లో 31 మంది ఆటగాళ్లు పాల్గొంటారని తెలిపారు. కెఎస్.భరత్, రేవంత్ రెడ్డి, మహీప్ కుమార్, అభిషేక్ రెడ్డి, సిఆర్ జ్ఞానేశ్వర్, మద్దిల హర్ష వర్ధన్, ఎస్‌కె రషీద్, హేమంత్ రెడ్డి, రికీ భుయ్, కరణ్ షిండే, అశ్విన్ హెబ్బార్, యర్రా సందీప్, జీవిఎస్‌పి తేజ, కెవి శశికాంత్, బ్రహ్మతేజ, పి.తపస్వి, సీహెచ్.స్టీఫెన్, పి.సత్యనారాయణ రాజు, యర్రా పృథ్వీరాజ్, కె.సుదర్శన్, కె.సాయి తేజ, సాకేత్ రామ్, మునీష్ వర్మ, సౌరభ్ కుమార్, ఎస్.ఆశిష్, ఎం.ఆంజనేయులు, టి.విజయ్, టి.భరత్, ఎ.లలిత్ మోహన్, జి.మనీష్, దీపన్ సాయినాథ్‌లు పాల్గొంటారని తెలిపారు.

ఎం 92, ఎం 96 క్యూడీ మినీ ఎల్ఈడీ ఏఐ టీవీలను తీసుకువచ్చిన హైయర్ ఇండియా

విశాలాంధ్ర - విశాఖపట్నం: వరుసగా 16 ఏళ్లు నంబర్ వన్ గ్లోబల్ హోమ్ అప్లయన్సెస్ బ్రాండ్ గా ఉన్నటువంటి హైయర్ అప్లయెన్సెస్ ఇండియా తాజాగా ఎం 92, ఎం 96 క్యూడీ మినీ ఎల్ఈడీ ఏఐ టీవీలను అందుబాటులోకి తీసుకువచ్చినట్టు హైయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు ఎన్.ఎస్.సతీష్ తెలిపారు. ఇప్పటికే ఎన్నో ఉత్పత్తుల ద్వారా భారతీయ వినియోగదారులకు అద్భుతమైన సేవలందిస్తోన్న హైయర్ ఇండియా ఇప్పుడు ఈ దసరా సీజన్ కోసం తన ప్రీమియం ఎం 92, ఎం 96 క్యూడీ మినీ ఎల్ఈడీ ఏఐ టీవీలను ప్రారంభిం చిందన్నారు. దీనిద్వారా హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్‌లో సరికొత్త బెంచ్‌మార్క్‌ను నెలకొల్పనుందని, ఇక ఇందులో ఉన్న ఫీచర్స్ విషయానికి వస్తే... లేటెస్ట్ ఏఐ అల్ట్రా సెన్స్ ప్రాసెసర్, డాల్బీ విజన్ ఐక్యూ, క్యూడీ మినీ ఎల్ఈడి టెక్నాలజీ ఉందన్నారు. అంతేకాకుండా కెఈఎఫ్ ద్వారా సౌండ్‌తో పాటు ఇండస్ట్రీలో టాప్ పొజిషన్‌లో ఉన్న శక్తివంతమైన 6.2.2 ఛానల్ స్పీకర్ సిస్టమ్ ఉందన్నారు. అంతేకాకుండా ప్రీమియం ఆడియో కోసం డాల్బీ అట్మోస్‌తో ఆధారితమైన ఎం 92 మరియు ఎం 96 సిరీస్ ఉండడం వల్ల... దేశవ్యాప్తంగా స్మార్ట్ టీవీ అనే పదానికి సరికొత్త అర్థాన్ని ఇచ్చినట్లు అవుతుంది.

దుర్గాదేవి నవరాత్రుల ముహూర్తపురాట

విశాలాంధ్ర - ఆనందపురం: శ్రీలక్ష్మి పైడితల్లమ్మ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో వేములవలస జంక్షన్‌లో ప్రతి ఏట నిర్వహించే దుర్గాదేవి నవరాత్రుల ఉత్సవాల ముహూర్తపు రాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అక్టోబర్ 2 దసరా నుండి 12వ తేదీ వరకు 11 రోజులు ఉత్సవాలు ఏర్పాటు చేస్తామని ఆలయ ఉత్సవ కమిటీ శ్రీ లక్ష్మి పైడితల్లమ్మ ఆటో స్టాండ్ యూనియన్ సభ్యులు తెలిపారు.

దుర్గమ్మను దర్శించుకున్న గవర కార్పొరేషన్ డైరెక్టర్

విశాలాంధ్ర - పెందుర్తి: దుర్గాదేవి శరన్నవరాత్రి సందర్భంగా పెందుర్తిలో పలు అమ్మవారి మండపాలను ఆంధ్రప్రదేశ్ గవర కార్పొరేషన్ డైరెక్టర్, పెందుర్తి గౌరీ సేవా సంఘం అధ్యక్షులు వేగి పరమేశ్వరరావు సందర్శించారు. ఉత్తరాంధ్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో గల దుర్గాదేవి గుడిలో స్వర్ణకవచాలకృత అవతారంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం

ప్రశాంత్ నగర్ దుర్గాదేవి గుడిలో రజిత అలంకరణ, ఆ తర్వాత రాతిచెరువు భూలోక అమ్మవారి గుడి ఆవరణలో దుర్గాదేవిని, పెందుర్తి వేగి వారి వీధిలో గల దుర్గాదేవిని బాల త్రిపుర సుందరి అవతారంతో, మోటార్ యూనియన్ వారి ఆధ్వర్యంలో దుర్గాదేవిని, పెందుర్తి పాత ఊరులో దుర్గాదేవి మాత అలంకారంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్న పరమేశ్వరరావు ప్రత్యేక పూజలు చేసారు. అమ్మవారి ఆశీస్సులతో ఈ ప్రాంతంలోని ప్రజలందరూ సుఖ:సంతోషాలతో వర్ధిల్లాలని ప్రార్ధన చేసినట్లు ఆయన తెలిపారు.

అమెజాన్ డాట్ ఇన్‌లో 'గ్రేట్ సేవింగ్స్ సెలబ్రేషన్' స్టోర్ ఫ్రంట్‌తో జీఎస్టీ

విశాలాంధ్ర - విశాఖపట్నం: సెప్టెంబర్ 22 నుండి అమలయ్యే విశేషమైన జీఎస్టీ సంస్కరణలను భారతదేశం అమలు చేస్తున్నందున అమెజాన్ డాట్ ఇన్‌లో ప్రత్యేకమైన స్టోర్ ఫ్రంట్ ద గ్రేట్ సేవింగ్స్ సెలబ్రేషన్, జీఎస్టీ బచత్ ఉత్సవ్ ప్రారంభిస్తున్నట్లు ఈరోజు ప్రకటించింది. గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్స్, నిత్యావసరాలు, ఆరోగ్య సంరక్షణ, ఫ్యాషన్ మరియు ఇంకా ఎన్నో వాటిలో సెప్టెంబర్ 23న, 2025 ప్రారంభమయ్యే అమేజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ (ఏజిఐఎఫ్) ప్రారంభమవుతున్న సమయంలోనే జీఎస్టీ ఆదాలతో స్టోర్ ఫ్రంట్ ఉత్పత్తులను ప్రదర్శిస్తుంది. సెప్టెంబర్ 22 అర్థరాత్రి నుండి ఆరంభమయ్యే ఏజీఐఎఫ్‌ని 24 గంటలు ముందస్తుగా ప్రైమ్ సభ్యులు ఆనందించవచ్చు. జీఎస్టీ బచత్ ఉత్సవ్‌లో భాగంగా, వర్తించే జీఎస్టీ ఆదాలను సూచించే ఉత్పత్తులపై బ్యాడ్జీలను స్టోర్ ఫ్రంట్ ప్రదర్శిస్తుంది. ఈ ఆఫర్లను కస్టమర్లు గుర్తించడానికి మరియు కొనుగోలు చేయడానికి వారికి సులభం చేసింది.

బిగ్ బెస్పోక్ ఏఐ ఫెస్టివల్'ను తీసుకువచ్చిన సామ్‌సంగ్

విశాలాంధ్ర - విశాఖపట్నం: భారతదేశంలో అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ అయిన సామ్‌సంగ్ , ఈరోజు 'ది బిగ్ బెస్పోక్ ఏఐ ఫెస్టివల్'ను ప్రకటించిందని సామ్‌సంగ్ స్థానిక స్టోర్ హెడ్ ఘుఫ్రాన్ ఆలం తెలిపారు. ఇది దాని అతిపెద్ద పండుగ వేడుక, ఇది దాని బెస్పోక్ ఏఐ డిజిటల్ ఉపకరణాలలో వినియోగదారులకు అద్భుతమైన డీల్‌లు, రివార్డులను అందిస్తుందన్నారు. అక్టోబర్ 26, 2025 వరకు చెల్లుబాటులో ఉన్న ఈ ఆఫర్లలో భాగంగా, వినియోగదారులు ప్రత్యేకమైన ఆఫర్‌లు, క్యాష్‌బ్యాక్, పండుగ రివార్డుల ద్వారా సామ్‌సంగ్ యొక్క తాజా ఏఐ ఆధారిత ఆవిష్కరణలతో వారి ఇళ్లను అప్‌గ్రేడ్ చేయడంలో సహాయపడుతుందన్నారు. ఈ ప్రచారంతో, సామ్‌సంగ్ ఈ పండుగ సీజన్‌లో భారతీయ వినియోగదారులకు అనుసంధానిత, సహజమైన, శక్తి-సమర్థవంతమైన సాంకేతికతను మరింత అందుబాటులోకి తెస్తోందన్నారు. బిగ్ బెస్పోక్ ఏఐ ఫెస్టివల్' సమయంలో, వినియోగదారులు ఎంచుకున్న బెస్పోక్ ఏఐ ఉపకరణాలపై రూ. 50000 వరకు క్యాష్‌బ్యాక్, విస్తృత శ్రేణి మోడళ్లలో 47 శాతం వరకు తగ్గింపులను పొందవచ్చు అన్నారు.